

మణికంఠస్వామి ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న నిర్వాహకులు

ఆలయంలో నవగ్రహ విగ్రహాల పునఃప్రతిష్ఠ

అమీర్‌పేట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట సైంటిఫిక్ కాలనీలో వీరాంజనేయస్వామి, సాయి మణికంఠస్వామి ఆలయంలో గురువారం శివ పంచాయతన ప్రతిష్ఠ, నవగ్రహ విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 27న ప్రారంభమైన పూజా కార్యక్రమాలు విగ్రహాల ప్రతిష్ఠతో గురువారం ముగిశాయని ఆలయ ప్రధాన కార్యదర్శి కుందారం ప్రభాకరచారి తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డీఎస్సీ ప్రకటనపై హర్షం

బోరబండ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగుల జీవితాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెలుగులు నింపారని పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నాయకుడు మహేష్ గౌడ్ అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం 11,062 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంతో బోరబండ బస్టాప్‌లో యువకులు స్వీట్లు తినిపించుకొని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిచర్డ్, విశాల్, రాహుల్, నరేష్, వజీర్ పాష, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో వాసవీ గ్రూప్ సభ్యులు

వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అభిషేక్ చందా, సౌమ్యా చందా పాల్గొన్నారు. రక్తదానం ఓ ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. ఈ సందర్భంగా వాసవీ గ్రూప్ సభ్యులు రక్తదానం చేశారు. రక్తదాతలను వాసవీ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అభినందించారు. ఫౌండేషన్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్

భద్రారెడ్డికి ఇండియన్ అచీవర్స్ అవార్డు



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న సీహెచ్ భద్రారెడ్డి

పంజాగుట్ట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, మల్లారెడ్డి హెల్త్ సిటీ సంస్థల చైర్మన్ డాక్టర్ సీహెచ్. భద్రారెడ్డికి వైద్య, విద్యా రంగంలో చేసిన సేవలకు ఇండియన్ అచీవర్స్ అవార్డు-2023 లభించింది. విద్యా సంస్థలు, హెల్త్ సిటీ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు విద్య, వైద్య సహాయం అందిస్తున్నారు. ఫిబ్రవరి 28న ఇండియన్ ఎకానమీపై ఇంటరాక్టివ్ ఫోరమ్ ద్వారా న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా భద్రారెడ్డి అవార్డు అందుకున్నారు. ఆయనతో పాటు పద్మభూషణ్ అవార్డు గ్రహీత సత్పాల్ సింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరవ్ ఖన్నా, సామాజిక సేవ చేస్తున్న సినీ, క్రీడా రంగాలకు చెందిన కొందరు ప్రముఖులు ఈ అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు.

5 నుంచి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ

సభ్యత్వ నమోదు

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మార్చి 5 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా కనీసం పదేళ్లు పనిచేసిన సర్వీస్ ఆధారాలతోపాటు ప్రస్తుతం జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం (ఐడీకార్డు, అక్రిడిటేషన్ కార్డు లేదా సంస్థ నుంచి అపాయింట్‌మెంట్ లెటర్)తో పాటు స్థానిక నివాస ధ్రువీకరణ (ఆధార్ కార్డు లేదా గ్యాస్ బిల్, కరెంట్ బిల్లు), రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని పేర్కొన్నారు. వీటితోపాటు ది గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేదా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ పేరిట రూ.1050 బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) తీసి దరఖాస్తు ఫారానికి జతచేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న టీవీ కాలనీ ఫేజ్-4, ప్లాట్ నంబర్ 198లో గల సొసైటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లభిస్తాయన్నారు. అర్హులైన జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9100933723, 9393353519 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రం అందజేస్తున్న ఎస్ఎస్‌కే పేగడ ఆకాష్

3న ఆనంద్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు మార్చి 3వ తేదీన జరగనున్నాయి. ఈ మేరకు అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు కె బాలేశ్వర్, సీహెచ్ వెంకటేశ్వరరావు గురువారం నామినేషన్ పత్రాలను స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఎస్ఎస్‌కే పేగడ ఆకాష్, ఎం. చంద్రశేఖర్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. 1వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



అమీర్‌పేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, వనం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు.

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

రూ. కోటి విలువ చేసే

అంగన్‌వాడీ స్థలం కబ్జా

- ఫిర్యాదు చేసినా స్పందించని రెవెన్యూ అధికారులు
- ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూమి



ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కోటి రూపాయలకు పైగా విలువ చేసే ప్రభుత్వ స్థలం అది. అంగన్‌వాడీ కేంద్రం కోసం కేటాయించారు. ఈ స్థలంపై కన్నేసిన కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించగా అప్పటి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. తాజాగా బోర్డును తొలగించి నిర్మాణాలు చేసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నాడు.

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ జ్ఞానీజైల్‌సింగ్ నగర్‌లో కొంత ఖాళీ స్థలం ఉంది. ఇందులో రెండు వందల గజాల స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని గతంలో బస్తీ వాసులు తీర్మానం చేశారు. అప్పటి పాలకులు కూడా అంగన్‌వాడీ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబర్చారు. బస్తీ చుట్టూ క్రమంగా నిర్మాణాలు పెరిగిపోవడంతో కొంతమంది కన్ను ఈ స్థలంపై పడింది. పలువురు పలుమార్లు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అప్పటి ఆర్డీవో కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.

కంచె చేను మేసినట్టు..

ఇటీవల ఓ వ్యక్తి స్థలం తాను కొనుగోలు చేసినట్టు ప్రచారం చేసుకున్నాడు. పట్టా ఉందని నమ్మించాడు. 15 రోజుల క్రితం ఫిలింనగర్‌కు చెందిన ఓ బస్తీలో తనకు ఉన్న పట్టా జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌కు సంబంధించినదే అంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వ సూచిక బోర్డు తొలగించి నిర్మాణాలు చేపట్టాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. సదరు వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఇదే అదనుగా భావించిన అతడు మరోసారి పక్కా నిర్మాణాలు చేస్తున్నాడు. ఈ వ్యవహారంపై మాల మహానాడు నాయకులతో పాటు స్థానికులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించలేదు. ఆక్రమణదారుడు నిర్మాణాల్లో వేగం పెంచాడు. రెవెన్యూ అధికారులు స్పందించకపోతే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ పార్టీకి చెందిన నాయకులు అండతోనే ఆక్రమణదారుడు రెచ్చిపోతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఫోన్‌కు ఇచ్చే విలువ ప్రాణానికి ఇవ్వండి

- పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించాలి
- డీసీపీ ఎల్. సుబ్బారాయుడు
- ట్రాఫిక్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు హెల్మెట్ల పంపిణీ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పగలకుండా ఉండేందుకు స్క్రీన్ గార్డులు, కవర్లు వేస్తామని, కానీ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంపై శ్రద్ధ లేదని, సెల్‌ఫోన్‌కు ఇచ్చిన విలువ ప్రాణానికి ఇవ్వాలని హైదరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ ఎల్. సుబ్బారాయుడు కోరారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట, నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ పీజీ కాలేజ్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, వారి పిల్లలకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ సహకారంతో ఉచితంగా 400 హెల్మెట్‌లు పంపిణీ చేశారు.

డీసీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితోపాటు పిలియన్ రైడర్‌లు(వెనుక కూర్చున్నవారు) కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగితే బీమా వర్తించదని గుర్తు చేశారు. నగరంలో దాదాపు 56.9 లక్షల ద్విచక్ర వాహనాలున్నాయని, దాదాపు 18 లక్షల మంది హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని తెలిపారు.

నిబంధనల ప్రకారం ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి రూ. 1200 జరిమానా, 3 నెలలు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేల జరిమానా, 3 నెలల జైలుశిక్ష విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మృదుల, ట్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎస్ రంగారావు, టీటీఐ ఏసీపీ జి. శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ వి రాంచందర్‌తోపాటు బోయినపల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ భవనం వద్దకు యజమాని మృతదేహం

- అడ్డుకున్న లీజుదారులు.. ఇరువర్గాల మధ్య ఘర్షణ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న ఓ హాస్టల్ భవనం వద్దకు యజమాని మృతదేహాన్ని తీసుకురాగా లీజుకు తీసుకున్న నిర్వాహకులు అడ్డుకోవటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.

మణికొండకు చెదిన ఎస్.రమణమ్మ(81)కు శ్రీనివాస్‌నగర్ వెస్ట్‌లో జీ ప్లస్ ఐదంతస్తుల భవనం ఉంది. 2021లో ఆ భవనాన్ని రామతులసి అనే మహిళకు హాస్టల్ నిర్వహణ కోసం అద్దెకిచ్చింది. కొంతకాలం తరువాత భవనం ఖాళీ చేయాలని రమణమ్మ కోరినా రామతులసి ఖాళీ చేయలేదు. రమణమ్మ ఒత్తిడిచేయడంతో ఆమె లాయర్ సహాయంతో కోర్టు నుంచి స్టేటస్ కో ఆర్డర్ తీసుకొచ్చింది. భవన యజమాని శ్రీనివాస్ నగర్ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను సంప్రదించగా.. ఫిబ్రవరి 11న కమ్యూనిటీహాల్‌లో సమావేశమై మాట్లాడదామని చెప్పారు. సమావేశానికి వస్తున్న రమణమ్మను ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద ద్విచక్రవాహనం ఢీకొట్టింది. గాయపడ్డ ఆమెను కొందరు వ్యక్తులు కమ్యూనిటీహాల్‌కు తీసుకొచ్చారు. కొన్ని కాగితాలపై సంతకాలు పెట్టాలని రామతులసి, ఆమె మద్దతుదారులు రమణమ్మను బలవంతపెట్టినట్టు తెలిసింది. దీంతో ఫిబ్రవరి 12న మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాయపడిన రమణమ్మను బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని హాస్టల్ వద్దకు తీసుకువచ్చారు. రామతులసి మద్దతుదారులు అడ్డుకోగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు రామతులసికి వత్తాసు పలుకుతున్నారని రమణమ్మ బంధువులు ఆరోపించారు.

మృతదేహాన్ని హాస్టల్ వద్దకు తీసుకొచ్చిన వారు తమపై దాడి చేశారని రామతులసి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హాస్టల్ వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు.

'ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ ప్రకటించాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 2013 పీఆర్‌సీ బాండ్స్ అరియర్స్ 50 శాతం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, 2017 పీఆర్‌సీ 30శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. డిపోల్లో సంక్షేమ మండళ్లను రద్దు చేసి యూనియన్‌ల కార్యకలాపాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

'రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఐదువేల కోట్ల రూపాయలతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. విదేశీ విద్యానిధి పథకాన్ని రెడ్డి సామాజికవర్గానికి వర్తింపచేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అన్ని విభాగాలలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, తహసీల్దార్ కార్యాలయాలలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంజీవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, హరినాథ్‌రెడ్డి, వసంతరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ నర్సింహారెడ్డి, వేదికపై రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ శ్రీదేవి

టెక్నాలజీ వినియోగంలో ఐఐటీలతో పోటీపడాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో ఐఐటీలు, ఎన్ఐటీలతో పోటీపడేందుకు సన్నద్ధంగా ఉండాలని జేఎన్‌టీయూ విద్యార్థులు, ఆచార్యులకు వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై జే-హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. నూతన పరికరాలను అందించేందుకు పూర్వవిద్యార్థులు సన్నద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, జె-హబ్ డైరెక్టర్ శ్రీదేవి క్యాంపస్ కాలేజీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ.. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెచప్పుడుగా మారింది

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ ప్యాకెట్ చిన్నదే కానీ.. అది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండె చప్పుడుగా మారింది.. అదే తరహాలో ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సాయంత్రం నానక్‌రామ్‌గూడలో ఓ ప్రైవేట్ హోటల్లో అవుట్‌లుక్ బిజినెస్ స్పాట్ లైట్ సమర్పించిన ఇండో గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు-2024 పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2030 నాటికి 600 మిలియన్ ఉద్యోగాలు అవసరమని అంచనాలు ఉన్నాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో ప్రతి పది ఉద్యోగాల్లో ఏడు ఉద్యోగాలు ఎంఎస్‌ఎంఈల నుంచే లభిస్తున్నాయని తెలిపారు. ప్రపంచ వ్యాపారంలో ఎంఎస్‌ఎంఈలు 90% వాటా కలిగి ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమలు ఉపాధి, జీడీపీ పెరుగుదలకు గణనీయంగా తోడ్పడుతున్నాయని, జీవనోపాధిపై ఆధారపడిన గ్రామీక, పేద మహిళలు, యువత, బలహీన వర్గాలకు ఈ తరహా పరిశ్రమలు చేయూతనందిస్తున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 20 మందికి ఆయన అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రెండు టికెట్లు

- 19 ఎంపి రూట్ బస్సులో ఆర్టీసీ కండక్టర్ నిర్వాకం
- ప్రశ్నించిన మహిళలు
- ప్రభుత్వానికి నష్టం చేసేందుకేనని ప్రయాణికుల ఆరోపణ

నిజాంపేట్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు కండక్టర్ రెండు జీరో టికెట్లు ఇస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీకి లాభం చేకూర్చేందుకు, ప్రభుత్వానికి నష్టం కలిగించేందుకే ఇలా చేస్తున్నారని పలువురు మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కూకట్‌పల్లి, కాకతీయహిల్స్‌లో నివసిస్తున్న శారద గురువారం 19 ఎంపి నంబర్ బస్సులో ఎక్కింది. ఆధార్ కార్డు చూపించగానే కండక్టర్ రెండు జీరో టికెట్లు ఇచ్చాడు. ఒక్కదానికే రెండు టికెట్లు ఎందుకిచ్చావని కండక్టర్‌ను ఆమె అడగగా.. ఇంకా ఎవరైనా ఎక్కితే చూపించవచ్చని అన్నాడు. శారద బస్సులో మిగిలిన వారిని అడగగా తమకూ రెండు టికెట్లు ఇచ్చినట్లు చెప్పారు. బస్సులో ప్రయాణిస్తున్న నలుగురైదుగురు మహిళలు ఇలా ఎందుకిస్తున్నావని కండక్టర్‌ను అడగగా.. జీరో టికెట్లే కదా... మీకేం నష్టం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. రెండు టికెట్లు ఇస్తున్నది ప్రభుత్వానికి నష్టం చేయడానికా అని ప్రశ్నించగా.. ఇంత నిజాయితీ మీకు పనికిరాదంటూ దురుసుగా సమాధానమిచ్చాడు. రెండు స్టాప్ దూరానికి టికెట్ తీసుకుంటే, వచ్చే స్టాప్‌కు కూడా టికెట్ ఇస్తున్నట్టు మరో మహిళ చెప్పింది.

తాను రోజూ బస్సులో ప్రయాణం చేస్తానని, ఇలానే జరుగుతోందని, కండక్టర్‌తో గొడవ ఎందుకని సర్దుకుపోతున్నట్టు ఆమె చెప్పింది. ఒక్కొక్కరికీ రెండు టికెట్లు ఇచ్చి ప్రభుత్వం ద్వారా ఆ డబ్బు రాబట్టుకోవడానికే ఆర్టీసీ అధికారులు ఇలాంటి కార్యక్రమానికి పాల్పడుతున్నట్లు శారద ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కోరారు.

ఆరుగురు దోపిడీ దొంగల అరెస్టు

- పరారీలో మరొకరు ● ఆటో, కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం

పంజాగుట్ట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): దారి దోపిడీలకు పాల్పడుతున్న ఓ ముఠాలో ఆరుగురిని పంజాగుట్ట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి ఆటో, కత్తి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి, ఎల్లమ్మబండ, చాంద్రాయణగుట్ట ప్రాంతాలకు చెందిన డి.బాదుర్‌సింగ్, టేకు నవీన్, గురుదేవ్‌సింగ్, సయ్యద్ గౌస్‌పాషా, షేక్ అల్తాఫ్ మస్తాన్, ఎం.తుల్జారాం స్నేహితులు. వీరిలో బాదుర్‌సింగ్, టేకు నవీన్, గురుదేవ్ సింగ్ పాత నేరస్థులు. మిగతా వారు ఆటో డ్రైవర్లు. అందరూ మద్యానికి, జల్సాలకు బానిసయ్యారు. డబ్బు కోసం దోపిడీలు చేయాలని నిర్ణయించుకొని స్థానికంగా ఉండే కల్లుసింగ్ వద్ద కత్తి కొనుగోలు చేశారు. ఫిబ్రవరి 25వ తేదీ రాత్రి ఆరుగురూ కలిసి ఆటోలో దోపిడీకి బయలుదేరారు. మధ్యలో మద్యం తాగారు. తెల్లవారుజామున 3.30 ప్రాంతంలో ఎర్రమంజిల్‌లో మెట్రో మాల్ వద్దకు చేరుకున్నారు. అటుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న లంగర్‌హౌస్‌కు చెందిన జె.నరేష్ కుమార్‌ను ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. అతడి మెడలో బంగారు గొలుసు లాక్కోవడానికి ప్రయత్నించగా ప్రతిఘటించాడు. కత్తి చూపించి చంపుతామని బెదిరించి సెల్‌ఫోన్, కొంత నగదు లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఆటో నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. నిందితులకు కత్తి విక్రయించిన కల్లుసింగ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. డీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో డీఎస్ఐ వెంకటకిషన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువతి వెంగళరావునగర్‌లో ఓ మహిళా హాస్టల్‌లో ఉంటోంది. అమీర్‌పేట పాస్‌పోర్ట్ ఈ సేవా కేంద్రంలో పనిచేసే సమయంలో అక్కడే పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన చిట్టిబాబు ఆమెకు పరిచయమయ్యాడు. కొద్దికాలం తర్వాత యువతి అక్కడ ఉద్యోగం మానేసింది. చిట్టిబాబు తరచూ ఆమెకు ఫోన్ చేసి లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. ఫిబ్రవరి 28న చిట్టిబాబు హాస్టల్ వద్దకు వెళ్లి యువతిని బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆమె సోదరుడికి సమాచారం ఇచ్చింది. అతడు హాస్టల్ వద్దకు రాగా చిట్టిబాబు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మోతీనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మాదాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 22వ తేదీన కావూరిహిల్స్ బస్టాప్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై లేత ఆకుపచ్చ రంగు టీషర్ట్ ఉందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ బాలరాజు కోరారు.

బస్సులో హాష్ ఆయిల్ తరలిస్తున్న వృద్ధుడికి రిమాండ్

దుండిగల్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బస్సులో హాష్ ఆయిల్ తరలిస్తున్న ఓ వృద్ధుడిని దుండిగల్ పోలీసులు అరెస్టు చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతంలోని నిదానందొడ్డి, బుద్ధ సూర్యారావు వీధిలో నివసిస్తున్న కుర్రు శంకర్‌రావు(71) గురువారం గండిమైసమ్మ చౌరస్తాలో బస్సు దిగాడు. అనుమానాస్పదంగా కనిపించడంతో దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడివద్ద లభించిన 944 గ్రాముల హాష్ ఆయిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- డిప్యూటీ సీఎంకు ఆర్. కృష్ణయ్య వినతి

రాంనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ. 5 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కోరారు. గురువారం డీప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను బీసీ సంఘాల నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు బకాయిల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించామన్నారు. తమ డిమాండ్లపై మంత్రి భట్టి సానుకూలంగా స్పందించారని, విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణ, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఫోన్‌కు ఇచ్చే విలువ ప్రాణానికి ఇవ్వండి

- పిలియన్ రైడర్ కూడా హెల్మెట్ ధరించాలి
- ట్రాఫిక్ 1 డీసీపీ ఎల్.సుబ్బరాయుడు
- ట్రాఫిక్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు హెల్మెట్ల పంపిణీ



అవగాహన కార్యక్రమంలో పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పగలకుండా ఉండేందుకు స్ర్కీన్ గార్డులు, కవర్‌లు వేస్తామని, కానీ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంపై శ్రద్ధ లేదని, సెల్‌ఫోన్‌కు ఇచ్చిన విలువ ప్రాణానికి ఇవ్వాలని హైదరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ ఎల్.సుబ్బారాయుడు కోరారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట, నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ పీజీ కాలేజ్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, వారి పిల్లలకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ సహకారంతో ఉచితంగా 400 హెల్మెట్‌లు పంపిణీ చేశారు. డీసీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితోపాటు పిలియన్ రైడర్‌లు (వెనుక కూర్చున్నవారు) కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగితే బీమా వర్తించదని గుర్తుచేశారు. నగరంలో దాదాపు 56.9 లక్షల ద్విచక్ర వాహనాలున్నాయని, దాదాపు 18 లక్షల మంది హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి రూ.1200 జరిమానా, 3నెలలు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5వేల జరిమానా, 3 నెలల జైలుశిక్ష విధిస్తారని తెలిపారు.

కార్యక్రమంలో పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మృదుల, ట్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎస్.రంగారావు, టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్‌తోపాటు బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న శంకర్

చట్టం ముందు అందరూ సమానులే

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానమేనని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం మారేడ్‌పల్లి సంజీవయ్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో శంకర్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి అంబేద్కర్ విద్యానిధి పథకం కింద 20లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్, కంప్యూటర్‌లలో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి ఆర్ఐ సర్వేష్, వార్డన్ జాలలోద్దిన్, బస్తీ నాయకులు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా బారి అశోక్ యాదవ్



బారి అశోక్ యాదవ్

తార్నాక, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమ నాయకుడు బారి అశోక్‌యాదవ్ ఎన్నికయ్యారు. గురువారం ఓయూలో నిర్వహించిన తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ సర్వసభ్య సమావేశంలో కమిటీ సభ్యులు బారి అశోక్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాంతోపాటు ప్రధాన కార్యదర్శిగా వడ్డె గణేష్, ఉపాధ్యక్షుడిగా బాలగాని సైదులు, అధికార ప్రతినిధిగా వెంపటి సురేష్, కోశాధికారిగా దండేపల్లి నవీన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా వెంపటి భగత్‌సింగ్, కార్యదర్శిగా కేలోత్ కిరణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.



వయోలిన్ విద్యార్థుల కచేరి

సంగీత నృత్య కళాశాల వార్షికోత్సవం

చిలకలగూడ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా, సాంస్కృతిక శాఖ అనుబంధంగా పనిచేస్తున్న సికిందరాబాద్, మారేడ్‌పల్లిలోని శ్రీ భక్తరామదాసు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కళాశాల విద్యార్థుల సంగీత, వాయిద్య, నృత్య ప్రదర్శనలు అలరించాయి. విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ రామచంద్రమూర్తి, హరిప్రియలను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గురువారంతో రెండు రోజుల వార్షికోత్సవ వేడుకలు ముగిశాయి.

మాజీ కార్పొరేటర్ దేవానంద్ మృతి



దేవానంద్ (ఫైల్)

పద్మారావునగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జెవ్వాది దేవానంద్(62) గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా గెలిచి, 2009-2014 వరకు ఐదేళ్లపాటు బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున క్రియాశీలకంగా పనిచేశారు. గురువారం మధ్యాహ్నం తర్వాత బన్సీలాల్‌పేట్‌లోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహం



సికింద్రాబాద్, రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో అనారోగ్యంతో ఓ గుర్తుతెలియని మహిళ చనిపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేటు నెంబరు 3లో గుర్తుతెలియని 60ఏళ్ల మహిళ చనిపోయి ఉండగా తోటి ప్రయాణికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలు అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలిస్తే వెంటనే 8919705664, 8712658581 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

యూసఫ్‌గూడ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన 22 ఏళ్ల యువతి వెంగళరావునగర్‌లోని ఓ మహిళా హాస్టల్‌లో ఉంటోంది. అమీర్‌పేట పాస్‌పోర్ట్ ఈ సేవా కేంద్రంలో పనిచేసే సమయంలో అక్కడే పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన చిట్టిబాబు పరిచయమయ్యాడు. కొద్దికాలం తర్వాత యువతి అక్కడ ఉద్యోగం మానేసింది. చిట్టిబాబు తరచూ ఆమెకు ఫోన్ చేసి లైంగికంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈనెల 28న హాస్టల్ వద్దకు వచ్చిన చిట్టిబాబు యువతిని బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. యువతి సమాచారంతో ఆమె సోదరుడు హాస్టల్ వద్దకు రాగా చిట్టిబాబు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ భూమేష్ కుమార్

ఐఏడీవీఎల్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ భూమేష్ కుమార్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అసోసియేషన్ ఫర్ డెర్మటాలజీస్ట్ వెనిరాలజిస్ట్ లెప్రాలజీస్ట్ (ఐఏడీవీఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా చిన్నపిల్లల చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ భూమేష్ కుమార్ నియమితులయ్యారు. హోటల్ నోవాటెల్‌లో జాతీయ స్థాయిలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అరుదైన గౌరవం దక్కింది. రెండేళ్ల పాటు కార్యదర్శిగా పదవిలో ఉంటారు. గాంధీ ఆస్పత్రి డెర్మటాలజీ విభాగం ప్రొఫెసర్‌గా చాలా ఏళ్ల నుంచి పనిచేసి గాంధీ ఆస్పత్రికి వచ్చే రోగులకు చర్మవ్యాధుల కోసం నిరంతరం అవగాహన ర్యాలీలు, హైద్రాబాద్ చుట్టుముట్టున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి దేశ విదేశాల్లో ట్యూటర్‌గా ఉంటూ పేరుప్రతిష్టలు తెచ్చుకున్నారు. ప్రస్తుతం సూర్యాపేట్ ప్రభుత్వ ఆస్పత్రిలో చర్మవ్యాధుల విభాగం విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో జన్మించిన డాక్టర్ భూమేష్‌కుమార్ గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో గాంధీ వైద్యులు ఆయనను అభినందనలు తెలిపారు.



వందేళ్ల పైలాన్‌ను సందర్శిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తదితరులు

పైలాన్ ఆవిష్కరణకు సీఎంను ఆహ్వానించాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

తార్నాక, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు ఏర్పాటు చేసిన ఓయూ వందేళ్ల పైలాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఓయూ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఈమేరకు గురువారం విద్యార్థి నాయకులతో కలిసి ఆర్ట్స్ కాలేజీ ముందు ఏర్పాటు చేసిన వందేళ్ల పైలాన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ఓయూకు నిధులు కేటాయించకుండా, నియామకాలు చేపట్టకుండా, వర్సిటీని భ్రష్టుపట్టించిన బీఆర్ఎస్ నాయకులకు ఓయూలో ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టే అర్హత లేదని మండిపడ్డారు. ఓయూకు ముఖ్యమంత్రిని ఆహ్వానించినట్లయితే ఓయూ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఓయూలో తాగునీటి సౌకర్యం, ఇతర సదుపాయాలను కల్పించేందుకు ఓయూ అధికారులు పూర్వవిద్యార్థుల సహకారం తీసుకోవాలని కోరారు. ఓయూలో పీవీ నర్సింహ్మారావు, జైపాల్‌రెడ్డి పేరు మీద పరిశోధక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తామన్నారు.

5 నుంచి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మార్చి 5 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా కనీసం పదేళ్లు పనిచేసిన సర్వీస్ ఆధారాలతోపాటు ప్రస్తుతం జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం (ఐడీకార్డు, అక్రిడిటేషన్ కార్డు లేదా సంస్థ నుంచి అపాయింట్‌మెంట్ లెటర్)తో పాటు స్థానిక నివాస ధ్రువీకరణ (ఆధార్ కార్డు లేదా గ్యాస్ బిల్, కరెంట్ బిల్లు), రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని పేర్కొన్నారు. వీటితోపాటు ది గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేదా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ పేరిట రూ.1050 బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) తీసి దరఖాస్తు ఫారానికి జతచేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న టీవీ కాలనీ ఫేస్- 4, ప్లాట్ నంబర్ 198లో గల సొసైటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లభిస్తాయని తెలిపారు అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వానికి కావాల్సిన సర్వీస్ ఆధారాలు, డీడీ తీసుకుని వచ్చి దరఖాస్తు నింపి సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9100933723, 9393353519లలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

బిర్యానీ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు .. గుండెచప్పుడుగా మారింది : డిప్యూటీ సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ ప్యాకెట్ చిన్నదే కానీ అది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండె చప్పుడుగా మారింది.. అదే తరహాలో ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు భారత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సాయంత్రం నానక్‌రామ్‌గూడాలోని ఓ ప్రైవేట్ హోటల్లో అవుట్ లుక్ బిజినెస్ స్పాట్‌లైట్ సమర్పించిన ఇండో గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు 2024 పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2030 నాటికి 600 మిలియన్ ఉద్యోగాలు అవసరమని అంచనాలు ఉన్నాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో ప్రతి పది ఉద్యోగాల్లో ఏడు ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల నుంచే లభిస్తున్నాయని తెలిపారు. ప్రపంచ వ్యాపారంలో ఎంఎస్ఎంఈలు 90% వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమలు ఉపాధి, జీడీపీ పెరుగుదలకు గణనీయంగా తోడ్పడుతున్నాయని, జీవనోపాదులపై ఆధారపడిన శ్రామిక, పేద మహిళలు, యువత, బలహీనవర్గాలకు ఈ తరహా పరిశ్రమలు చేయూతనందిస్తున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. ఎంఎస్ఎంఈ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 20 మందికి ఆయన అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేడ్చల్ మల్కాజిగిరి లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు

డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన

మచ్చబొల్లారం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో అక్షరాస్యతతో పాటు డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి లీడ్ బ్యాంక్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా గురువారం అల్వాల్ సర్కిల్ కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో డిజిటల్ లావాదేవిలపై ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నేడు మారుతున్న ఆధునిక సమాజంలో ప్రతి విద్యార్థి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తద్వారా విద్యార్థి త్వరితగతిన ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మార్గం సుగమమౌతుందని ఆయన అన్నారు. సొమ్మును వివేకంగా మదుపుచేయాలని తెలిపారు. ఆర్థిక నేరాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. తక్కువ కాలంలో ఎక్కువ రాబడి పథకాలు ప్రమాదకరమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్యాంకులు కల్పిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయుడు మురళి మాట్లాడుతు బ్యాంకింగ్ విధానం, డబ్బులు మదుపు చేయడం వలన ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు లీడ్ బ్యాంక్ మేనేజర్ బహుమతులు అందజేశారు. లీడ్ బ్యాంకు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ ప్రకటించాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 2013 పీఆర్‌సీ బాండ్స్ ఏరియర్స్ 50 శాతం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, 2017 పీఆర్‌సీ 30శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. డిపోల్లో సంక్షేమ మండళ్లను రద్దు చేసి యూనియన్‌ల కార్యకలాపాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

ఒకరికి రెండు టికెట్లు

- 19 ఎంపీ రూట్ బస్సులో ఆర్టీసీ కండక్టర్ నిర్వాకం
- ప్రశ్నించిన మహిళలు
- ప్రభుత్వానికి నష్టం చేసేందుకేనని ప్రయాణికుల ఆరోపణ

నిజాంపేట్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు కండక్టర్ రెండు జీరో టికెట్లు ఇస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీకి లాభం చేకూర్చేందుకు, ప్రభుత్వానికి నష్టం కలిగించేందుకే ఇలా చేస్తున్నారని పలువురు మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి....కూకట్‌పల్లి, కాకతీయహిల్స్‌లో నివాసముంటున్న శారద గురువారం 19 ఎంపి నెంబర్ బస్సులో ఎక్కింది. ఆధార్ కార్డు చూపగానే కండక్టర్ రెండు జీరో టికెట్లు ఇచ్చాడు. ఒక్కదానికే రెండు టికెట్లు ఎందుకిచ్చావని కండక్టర్‌ను అడగగా ఇంకా ఎవరైనా ఎక్కితే చూపించవచ్చని అన్నాడు. శారద బస్సులో మిగిలిన వారిని అడగగా తమకూ రెండు టికెట్లు ఇచ్చినట్లు చెప్పారు. బస్సులో ప్రయాణిస్తున్న నలుగురైదుగురు మహిళలు ఇలా ఎందుకిస్తున్నావని కండక్టర్‌ను అడగగా జీరో టికెట్లే కదా... మీకేం నష్టం లేదు కదా... అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. రెండు టిక్కెట్లు ఇస్తున్నది ప్రభుత్వానికి నష్టం చేయడానికా అని ప్రశ్నించగా ఇంత నిజాయితీ మీకు పనికి రాదంటూ దురుసుగా సమాధానమిచ్చాడు. రెండు స్టాపుల దూరానికి టికెట్ తీసుకుంటే, వచ్చే స్టాప్‌కు కూడా టికెట్లు ఇస్తున్నట్లు మరో మహిళ చెప్పింది. తాను రోజూ బస్సులో ప్రయాణం చేస్తానని, ఇలానే జరుగుతుందని, కండక్టర్‌తో గొడవ ఎందుకని సర్దుకుపోతున్నట్లు ఆమె చెప్పింది. ఒక్కొక్కరికీ రెండు టికెట్లు ఇచ్చి ప్రభుత్వం ద్వారా ఆ డబ్బు రాబట్టుకోవడానికే ఆర్టీసీ అధికారులు ఇలాంటి కార్యక్రమానికి పాల్పడుతున్నట్లు శారద ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆమె కోరారు.



కండక్టర్ ఇచ్చిన రెండేసి టికెట్లు



19 ఎంపీ నెంబర్ బస్సులో ప్రయాణికులు



తేజో మూర్తికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న తోటి ఉద్యోగులు

రైల్వే ఉద్యోగుల పదవీ విరమణ

చిలకలగూడ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సికిందరాబాద్‌లో గురువారం 71 మంది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలుతో రేల్వే కార్యాలయాలు సందడిగా మారాయి. రైల్ నిలయంలో డిప్యూటీ విజిలెన్స్ ఆఫీసర్ రామకృష్ణన్ లేఖా భవన్‌లో ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ తేజోమూర్తికి ఎంప్లాయిస్ సంఘ్ మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్ శాలువా, జ్ఞాపికతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.



నూతన ఇన్‌స్పెక్టర్‌కు స్వాగతం, బదిలీపై వెళ్తున్న సైదులుకు ఏసీపీ వీడ్కోలు

గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట్‌రాములు

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బొల్లు వెంకట్‌రాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన వెంకట్‌రాములు ఎస్సైగా వికారాబాద్, నిజామాబాద్, టప్పాచబుత్రలలో పనిచేశారు. ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది జీఆర్పీలో పనిచేస్తు గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చారు. నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సమక్షంలో బాధ్యతలు స్వీకరణ, బదిలీపై వెళ్తున్న సైదులుకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సతీష్, బసు, సిబ్బంది పాల్గొన్నారు.

రాచకొండలో 14 మంది ఇన్‌స్పెక్టర్‌లు మల్టీజోన్‌కు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ విధుల్లో భాగంగా రాచకొండ కమిషనరేట్‌లో పనిచేస్తున్న 14 మంది ఇన్‌స్పెక్టర్‌లను మల్టీజోన్ 2కు అటాచ్ చేస్తూ సీపీ తరుణ్‌జోషి గురువారం ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి వీసీఆర్ ఆర్. నిరంజన్, కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎం.మహేష్, ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌ఓ జి.గోవర్ధనగిరి, కుషాయిగూడ డీఐ బి.సాయిప్రకాష్‌గౌడ్, వనస్థలిపురం డీఐ బి.వెంకటయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ 1 ఎల్.బాలుచౌహాన్, కుషాయిగూడ ట్రాఫిక్ పి.రఘువీర్‌రెడ్డి, చౌటుప్పల్ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్. సైదులు, ఎస్ఓటీ 2 ఈ.జంగయ్య, పి.సైదులు, సీసీఎస్ ఎల్బీనగర్ ఎన్. జయరాం, కె.సత్యనారాయణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్ మల్టీజోన్ 2 ఐజీపీకి వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీచేశారు.

మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేష్



సీఐ వెంకటేష్

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.వెంకటేష్ బుధవారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కి చెందిన సీఐ ఎన్. వెంకటేష్ జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్ బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వడానికి ఇన్‌స్పెక్టర్ హోదాలో విధులు నిర్వహించడానికి వెళ్లారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేష్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ.... ముందుగా బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా పెట్రోలింగ్ వ్యవస్థను మరింతగా పెంచుతామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా చూస్తామని, ఇందుకు పౌరులు సైతం చట్టాలను గౌరవిస్తూ నియమనిబంధనలు పాటించాలని కోరారు.



బోయిన్‌పల్లి విద్యాగణపతి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో జంపనప్రతాప్

విఘ్నాలను తొలగించే సంకటహర చతుర్థి

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సంకటములను తొలగించే సంకటహర చతుర్థి వ్రతాన్ని ఆలంబనంగా ఆచరిస్తూ ఉంటారు. బోయిన్‌పల్లి విద్యాగణపతి ఆలయంలో గురువారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాణాప్రతాప్ యువసేన ప్రతినిధులు రీగారు రాముగౌడ్, శశిధర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, దయానంద్ యాదవ్, టింకు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం వద్దకు యజమాని మృతదేహం

- అడ్డుకున్న నిర్వాహకులు
- ఇరువర్గాల మధ్య ఘర్షణ

యూసఫ్‌గూడ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న ఓ హాస్టల్ భవనం వద్దకు యజమాని మృతదేహాన్ని తీసుకురాగా లీజుకు తీసుకున్న నిర్వాహకులు అడ్డుకోవటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... మణికొండకు చెందిన ఎస్.రమణమ్మ(81)కు శ్రీనివాస్‌నగర్ వెస్ట్‌లో జీ ప్లస్ ఐదంతస్తుల భవనం ఉంది. 2021లో ఆ భవనాన్ని రామతులసి అనే మహిళకు హాస్టల్ నిర్వహణ కోసం అద్దెకిచ్చింది. కొంతకాలం తరువాత భవనం ఖాళీ చేయాలని రమణమ్మ కోరినా రామతులసి ఖాళీ చేయలేదు. రమణమ్మ ఒత్తిడి తేవడంతో రామతులసి లాయర్ సహాయంతో కోర్టు నుంచి స్టేటస్ కో ఆర్డర్ తీసుకొచ్చింది. రమణమ్మ శ్రీనివాస్‌నగర్ వెస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను సంప్రదించగా ఈనెల 11న కమ్యూనిటీహాల్‌లో సమావేశమై మాట్లాడదామని చెప్పారు. సమావేశానికి వస్తున్న రమణమ్మను ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డులోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద ద్విచక్రవాహనం ఢీకొట్టింది. గాయపడ్డ ఆమెను కొందరు వ్యక్తులు కమ్యూనిటీహాల్‌కు తీసుకొచ్చారు. రమణమ్మను కొన్ని కాగితాలపై సంతకాలు పెట్టాలని రామతులసి, ఆమె మద్దతుదారులు బలవంతపెట్టినట్టు తెలిసింది. ఈ ఘటనపై రమణమ్మ 12న మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రమాదంలో గాయపడ్డ రమణమ్మను ఆమె బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతదేహాన్ని హాస్టల్ వద్దకు తీసుకురాగా రామతులసి మద్దతుదారులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రమణమ్మను చంపేందుకు రామతులసి ప్రయత్నించారని, పోలీసులు ఆమెకు వత్తాసు పలుకుతున్నారని రమణమ్మ బంధువులు ఆరోపించారు. మృతదేహాన్ని హాస్టల్ వద్దకు తీసుకొచ్చిన వారు తమపై దాడి చేశారని రామతులసి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. హాస్టల్ వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా గస్తీ ఏర్పాటు చేశారు.